ఈ వారం స'రసం'

# ఆఖరి క్షణాలు


అడవిలో రాజభటులు బండ మీద తమ కత్తులు నూరుకుంటున్నారు. మర్రి చెట్టు కింద కొత్వాలు అసహనంగా నిలబడ్డాడు. వధ్యకార్యం చప్పున ముగించాలని ఆరాటపడుతూ కొద్ది క్షణాల్లో తన తల తెగుతుందన్న ఆలోచనే తలకెక్కనట్టు కవి చెట్టు నానుకుని ఆకాశం కేసి చూస్తున్నాడు. బందీనీ, కొత్వాలునీ, భటుల్నీ మోసుకొచ్చిన గుర్రాలు అక్కడ జరగబోయే ఘోరాన్ని కళ్ళారా చూడలేక కాబోలు చూపులు తిప్పుకుంటున్నాయి. చేస్తున్నపని ఆపి చెమట తుడుచుకొని కత్తి పదును చూసుకుంటున్నాడొక భటుడు. తృప్తి పడలేదు కాబోలు, మళ్ళీ నూరడం మొదలెట్టాడు.

కొత్వాలు బందీ కేసి చూసాడు. "ఇదిగో కవీ. చావు దగ్గిరపడింది. నీ ఇష్ట దైవాన్ని స్మరించుకో. ప్రాణం తీసేముందు ప్రార్థించుకొనే అవకాశం ఇవ్వడం ఆనవాయితీకదా. చప్పున కానీయ్" అన్నాడు దర్పం ఉట్టిపడే స్వరంతో.

కవి కొత్వాలు కేసి సాలోచనగా చూసాడు. నవ్వుకున్నాడు. ఇష్టదేవతను తలచుకోవాలిట. తన ఇష్టదేవత, రసాధిదేవత, ఆనందదాయిని, ముక్తిప్రదాయిని అన్నీ యామినియే. ఆమె తలపులలోంచి తప్పుకుంటే కదా స్మరించుకొనే అవసరం పడేది. రాజుగారు తమను విడదీసే వరకూ తాము కౌగిలిలో కలిసేవున్నారు. విడదీసిన తర్వాత కలల్లో కలసి వున్నారు. ఆమె రాకుమారి కాకుంటే ఈ కష్టాలు వచ్చేవే కావు. ఆ మాటకొస్తే తను కవి కాకున్నా వచ్చేవి కావు. వలపు, వగపు రెండూ వుండేవి కావు.

రాజుగారు తమ కుమార్తెను సాహిత్యంలో నిష్ణాతురాలను చేయాలనుకోవడంతోనే ప్రారంభమయింది కథ. రాజ్యంలో మేటి పండితుడు కవి ఎవరని విచారించబోతే తన గురించే చెప్పారు నిలయ విద్వాంసులు. రాజుగారు సంతోషించారు. తనను కళ్ళారా చూసేదాకా ఆయన కళ్ళల్లో కనబడ్డ అయోమయం తనను తికమక పెట్టింది. ఇటీవలే తెలియ వచ్చింది. ఆయనకొచ్చిన మీమాంస ఏమిటో– ఆ రాత్రే మంత్రిగారితో అన్నారట. కవిగారి పాండితీ ప్రకర్ష చూస్తే మా అమ్మాయికి గురువు కావల్సిన మహానుభావుడితనే అనిపిస్తోంది. కానీ రూపం చూడబోతే సమ్మోహనకరం. నా కుమార్తె కూడా అతిలోక సుందరి. ఒకరినొకరు చూసుకుంటే చదువు మాట ఎలాగవున్నా ప్రేమలో పడడం నిశ్చయం. ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు.

మంత్రిగారు చెప్పిన ఉపాయమే కాబోలు. మర్నాడు తనను రప్పించి అంతఃపురంలోనే వుండి రాకుమారికి సాహిత్యకళ నేర్పమని కోరుతూ రాజుగారు ఒక విషయం చెప్పారు. "కవివర్యా, ఒక చిన్న విషయం. అమ్మాయి చర్మవ్యాధితో బాధపడుతోంది. అందువల్ల ఎవరికంటా పడడానికి ఆమె ఇచ్చగించదు. మీ మధ్య తెరగట్టిస్తాను. తెరకిటువైపు వున్న గదిలో మీ నివాసం, అటువైపు భాగంలో ఆమె గది. మీకు అందువల్ల చదువుకి అంతరాయం వుండదు. మీకు అభ్యంతరం వుండదనే భావిస్తున్నాం" రోగపీడితుల మానసికస్థితిని సహృదయంతో అర్థం చేసుకోలేనివాడా తను? సరేనన్నాడు.



ఆ రోజే యామినికి కూడా చెప్పారట. "అమ్మాయీ, నీకు పాఠాలు చెప్పడానికి కుదిర్చిన విద్వాంసుడు పుట్టుగుడ్డి. తన కన్నులు లొత్తలు పడి వుండడం వల్ల ముఖం ఎవరికీ చూపించడానికి ఇష్టపడడు. మధ్య తెరగట్టి విద్యగరపమని ఒప్పించాల్సి వచ్చింది." అని. విద్యాభ్యాసం మొదలు పెట్టిన ఆరు నెలల వరకు ఆ తెరచాటు భామిని యామినిని తను చూడనేలేదు. ఒక రోజు కిటికీలోంచి కనబడుతున్న పున్నమి చంద్రుడిని చూసి తను పరవశించిపోయాడు. ఆ చందమామలో కనబడే మచ్చను కొంత మంది కుందేలంటారు. కొంతమంది లేడి అంటారు. కానీ ప్రియురాలి అధరంలో నింపడానికి అమృతాన్ని వెలికితీసినప్పుడు ఏర్పడిన గుంటే అది అనిపించింది తన కానాడు. ఆ ఆలోచన మనసులో పుట్టగానే తన ప్రమేయం లేకుండానే ఆశువుగా కవిత రూపంలో వెలువడింది తన పెదాలపై.

తెర కవతలవున్న రాకుమారి విన్నది ఆ పద్యాన్ని. జాత్యంధుడికి చందమామ అందాలెలా తెలిసాయా అని అబ్బురపడి తెర తొలగించి చూసింది. తను ఆమె కంట పడినప్పుడు ఆమె తన కంట పడకుండా వుంటుందా? తనవంటి సౌందర్యపిపాసి తలమునకలుగా ప్రేమలో పడ

కుండా వుంటాడా? ఆమె మాత్రం? అంతరాలు గణించకుండా అంతరంగంతో బాటు సర్వస్వాన్నీ తనకు అర్పించుకొంది.

ఇలాంటి విషయాలు అంతః



పురంలోనే అణిగిపోవుగా. తమ వ్యవహారం పెదవులు దాటి కిందకు పాగిందన్న విషయం పృథివి దాటదా? పృథ్వీపతి చెవులు దాటి పోగలదా? కూతురు కాబట్టి యామినిని క్షమించి తనకు మాత్రం దండం విధించారు రాజుగారు.

"ఏమయ్యా, ప్రార్థన ముగిసిందా. కళ్ళు మూసుకుంటే దేవీదర్శనం అవుతోందా?" అని అడిగాడు కొత్వాలు.

నిజంగా దేవీ దర్శనమే. అలకపూనిన యామినీదేవి దర్శనమే. ఆ రోజు ప్రణయ కలహంతో ఆమె రగిలిపోతూండగా తను తుమ్మాడు. చిరంజీవి అందామంటే ఆమె పట్టుదల చెడిపోదూ. అయినా ఊరికే వుండడానికి మనసు రాలేదు. పాపం. అమంగళం ప్రతిహతం కావడానికి సువర్ణాభరణం తొడగాలని నమ్మకం. ఆమె చెవి కమ్మ తీసి తన చెవికి తొడగబోయింది. అదే అద నని తను ఆమె కుచకలశాలను చేబట్టాడు. పాపం అడ్డు పెడదామంటే రెండు చేతులూ చెవి కమ్మ పెట్టే పనిలో వున్నాయి. వక్షాన్ని కాపాడుకోవాలంటే ఆభరణాన్ని జార్చి వేయాలి. అమంగళమేమోనన్న భయం. అందువల్ల ఆ పని పూర్తయేవరకూ సహించి ఆ తరువాత ఇనుమడించిన కోపంతో చేయి తోసేసింది. తెల్లారేసరికి ఆమెకు కోపం తగ్గింది. కానీ తనకు తెలపడం ఎలా? నిద్రలో తెలియనట్టుగా ఒక చేయి తనపై పడేసింది. తను గ్రహించాడు. లేచి ఆమె ముఖం కేసి చూశాడు. కొంటెతనం, కోరిక దోబూచులాడుతున్నాయి. ఆ ముఖమే తన ఆఖరి క్షణాల్లో కళ్ళ ముందు నిలుస్తోంది. ముఖంపై చిరునవ్వు వెలుస్తోంది.

"కవీ సిద్ధమేనా?" అంటున్నారు భటులు.

కవికి హఠాత్తుగా బిల్హణుడి చరిత్ర గుర్తుకు వచ్చింది. తనలాటి కథే అతనిది. ఇటువంటి ఘట్టంలో అతను చిరునవ్వు నవ్వితే భటులు అడుగుతారు ఏమిటయ్యా కారణం అని. అతను తన కళ్ళ ముందు కదలాడే ప్రియురాలి చేష్టల గురించి అనేక శ్లోకాలలో వివరిస్తాడు. భటుల మనసు కరిగి రాజుగారికి విన్నవించి బిల్హణుడు ప్రియురాలూ వివాహం చేసుకోవడానికి దోహదపడతారు. అది బిల్హణ చరిత్రం కావ్యంగా సంస్కృతంలో. దరిమిలా అనువాద ప్రబంధంగా తెలుగులో వన్నెకెక్కింది. తనూ బిల్హణుడిలాగానే చేసి చూస్తే? వీరి మనసులు కరిగి....

వద్దు. తన ప్రియురాలి అంగాంగ వర్ణన వీళ్ళెందుకు వినాలి? ఆమె తనది, ఆమెతో అనుభవాలు తనవి. పరాయివారితో పంచుకోదగిన అనుభూతులు కావవి. ఆమె శరీరాన్ని బట్టబయలు చేసేకంటే తను మృత్యువును ఆహ్వానించడం మేలు. ఆమె రూపాన్ని కళ్ళ ముందు నిలుపుకొని పరలోకానికి పయనం కావడం మేలు అనుకున్నాడు కవి.

"మీ పని కానివ్వండి నాయనా" అన్నాడతను మోకరిల్లుతూ. ●

— విద్యాపతి